సాక్షి
జగిత్యాల

బుధవారం । 27 । ఆగస్టు । 2025

న్యూస్‌రీల్

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి, చిత్రంలో కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: యూరియా పంపిణీ విషయంలో రైతులకు ఇబ్బంది కలిగించొద్దని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. 20 మండలాల్లోని 51 పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు ఎరువులు అందిస్తున్నట్లు వెల్లడించారు. యూరియా సరఫరా నిరంతర ప్రక్రియ అన్నారు. ఇప్పటివరకు 27,479 టన్నులు అందించామన్నారు. గతేడాదితో పోలిస్తే రైతుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్యాక్స్, ప్రైవేటు అవుట్‌లెట్ ద్వారా సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్, డీఏవో భాస్కర్, డీసీవో మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారు

బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు నిరసనలు, ధర్నాలు చేస్తూ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని మంత్రి అన్నారు. కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. యూరియా సరఫరా పూర్తిగా కేంద్రం పరిధిలో ఉందన్నారు. కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. రైతులు ఎ లాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి రైతుకు యూరియా అందిస్తామన్నారు.

పుష్కరఘాట్ల పరిశీలన



గోదావరి తీరంలోని పుష్కరఘాట్‌లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్.లత

ధర్మపురి: గోదావరి పుష్కరాల నేపథ్యంలో అదనపు కలెక్టర్ లత ధర్మపురిలోని గోదావరి తీర ప్రాంతంలో గల పుష్కరఘాట్లను మంగళవారం పరిశీలించారు. 2027 జూలైలో జరిగే పుష్కరాలల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళిగడ్డ, మహాలక్ష్మి, సీతారామచంద్ర, సంతోషిమాత ఘాట్‌లను పరిశీలించి అధికారుల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెవెంట ఆలయ ఈవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



పరిశోధన స్థానం డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీచింగ్ సిబ్బంది

జగిత్యాలఅగ్రికల్చర్: పొలాస వ్యవసాయ కళాశాల టీచింగ్ సిబ్బంది మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. టీచింగ్ స్టాఫ్‌పై వ్యవసాయ యూనివర్సిటీ ఉన్నతాధికారుల నిరంకుశ వైఖరిని నిరసిస్తూ పరిశోధన స్థానం డైరెక్టర్ హరీశ్‌కుమార్‌శర్మకు వినతిపత్రం అందించారు. టీచింగ్ స్టాఫ్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా ఉద్యోగులను మానసికంగా వేధిస్తూ తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. పారదర్శకత లేకుండా ఇష్టమొచ్చినట్లు బదిలీలు చేశారని తెలిపారు. పదోన్నతుల్లోనూ అన్యాయం జరుగుతోందని, ట్రాన్స్‌ఫర్ ట్రావెల్ అలవెన్స్‌లు ఇవ్వడం లేదని ఆరోపించారు.

జిల్లాకు మోస్తరు వర్ష సూచన

జగిత్యాలఅగ్రికల్చర్: రానున్న ఐదురోజుల్లో జిల్లాలో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి తెలిపారు. ఈనెల 27నుంచి 30వరకు అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశం ఉందని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 28 నుంచి 29 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 24 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: స్థానిక వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో ఖాళీలను కాంట్రాక్ట్ ప్రతిపాదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ షర్మిల తెలిపారు. ప్రొఫెసర్లు 7, అసోసియేట్ ప్రొఫెసర్లు 28, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 18, సీనియర్ రెసిడెన్సీలు 28 పోస్టులు భర్తీ చేస్తామని, అర్హులు సెప్టెంబర్ 1న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ వైద్య కళాశాలలో హాజరు కావాలని, వివరాల కోసం WWW.G MC-J-A-GT-I-A-L.CO Mలో లాగిన్ అయి తెలుసుకోవచ్చన్నారు.

రోడ్లు ఇలా.. గణేశుడు వచ్చిపోయేదెలా..

- అడుగడుగునా గుంతలు • వాహనాలు పడిపోయే ప్రమాదం
- కురుస్తున్న వర్షాలకు మోకాలు లోతు • నేటి నుంచి వినాయక చవితి వేడుకలు
- ఎత్తైన విగ్రహాలు నెలకొల్పుతున్న నిర్వాహకులు
- గణేశుడి శోభాయాత్రకు జిల్లాకు రూ.25 లక్షల నిధులు
- నిమజ్జనం వరకైనా రోడ్లను బాగు చేయాలంటున్న ప్రజలు



సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

- ఈ చిత్రం జిల్లాకేంద్రం నుంచి ధర్మపురికి వెళ్లే ప్రధాన రోడ్డు. హైవే కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాటిని పూడ్చకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. మంటపాలకు గణనాథులు వెళ్లే సమయంలో అనేక ఇబ్బందులు పడ్డారు. గుంతలను తప్పించేందుకు నానా హైరానాపడ్డారు. కనీసం నిమజ్జనం వరకైనా ఈ గుంతలను పూడ్చాలని మంటపాల నిర్వాహకులు కోరుతున్నారు. లేకుంటే శోభాయాత్ర సందర్భంగా గుంతల్లో వాహనాల టైర్లు పడితే స్వామివారు ఒక్కపక్కకు ఒరిగే అవకాశం ఉంటుందంటున్నారు.



ఈ చిత్రం జిల్లాకేంద్రంలోని ఉద్యానవనం నుంచి కొత్తబస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారి. ఇక్కడ కొద్దిరోజుల క్రితం మిషన్ భగీరథ కోసం తవ్వి వదిలేయడంతో పెద్ద గుంతగా మారింది. పలుమార్లు అధికారులకు విన్నవించగా కంకర పోయించారు. కొద్దిరోజులకు ఆ కంకర మొత్తం కొట్టుకుపోయింది. ఇప్పుడు ఆ రోడ్డు అలాగే ఉంది. వినాయక శోభాయాత్ర వెళ్లాలంటే పరిస్థితి దారుణంగా ఉంటుంది.



- ఇది టవర్‌సర్కిల్ ప్రాంతం. ఇక్కడ రోడ్లంతా కంకరతో నిండిపోయాయి. సీసీరోడ్డు అంతా పగిలిపోవడం, పైప్‌లైన్ల కోసం తవ్వి వదిలేయడంతో రోడ్డంతా అధ్వానంగా మారింది. ఇది ప్రధాన జంక్షన్. ప్రతి ఒక్క గణనాథుడు ఇక్కడి నుంచే వెళ్లాల్సి ఉంటుంది. కనీసం మొరం అయినా పోయాలని ప్రజలు కోరుతున్నారు.

జగిత్యాల: జిల్లా కేంద్రం నుంచి సుదూర ప్రాంతాలకు గణనాథుని విగ్రహాలు తరలివెళ్తుంటాయి. జిల్లా కేంద్రంలోనే రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. గణనాథులు వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లడానికి నిర్వాహకులు నానా తంటాలు పడుతున్నారు. ప్రధానమైన రోడ్లలో ఎక్కడబడితే అక్కడ గుంతలు ఉండటం.. మున్సిపల్ అధికారులు కనీసం మరమ్మతులు చేయించకపోవడంతో గుంతల్లో వాహనాలు పడి ఇబ్బందికరంగా మారింది. కనీసం శోభాయాత్ర వరకైనా మరమ్మతు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

జిల్లా కేంద్రంలో ప్రధాన చోట్లలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు ఉన్నాయి. కనీసం విద్యుత్ అధికారులు వాటిని సరిచేయకపోవడంతో పెద్దపెద్ద గణనాథులు వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారింది. సాయిబాబా గుడి సమీపంలో వెళ్తున్న ఒక గణనాథుడు అతిపెద్దగా ఉండటంతో కరెంట్ వైర్లను తాకింది. పెద్ద ప్రమాదం తప్పింది. ఇటీవల జిల్లాలోని కోరుట్లలో గణనాథులను తరలిస్తున్న సమయంలో కరెంట్ షాక్‌కు గురై మృతిచెందిన విషయం తెలిసిందే. శోభాయాత్ర వరకైనా విద్యుత్ అధికారులు స్పందించి వైర్లను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

శోభయాత్రకు రూ.25 లక్షల నిధులు

జగిత్యాల మున్సిపాలిటీలో వినాయకుని శోభాయాత్ర కోసం రూ.25 లక్షల నిధులు కేటాయించారు. గుంతలను మొరంతో పూడ్చడం, లైటింగ్, తాగునీటి సరఫరా, క్రేన్స్ తదితర వాటి కోసం నిధులు కేటాయించారు.



- ఈ చిత్రం జిల్లాకేంద్రంలోని కొత్తబస్టాండ్ సమీపంలోగల ప్రధాన రోడ్డు. ఇక్కడ పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనాలు సమీపించే వరకూ గుంతలు కనబడడం లేదు. ఒక్కసారిగా సడెన్ బ్రేక్ వేస్తే వాహనాలు అందులో పడిపోతున్నాయి. శోభాయాత్రకు వెళ్లాలన్నా.. మంటపాలకు తరలాలన్న ఈ రోడ్డుమీదుగానే తీసుకెళ్తుంటారు. అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



- ఇది విజయపురి కాలనీకి వెళ్లే రహదారి. ఎస్వీఎల్‌ఆర్ గార్డెన్స్‌కు వెళ్లే ప్రధాన రహదారి. ఇక్కడ మామూలుగా వెళ్లాలంటేనే ఇబ్బంది. ఇక గణనాథులు ఈ రోడ్డు వెంట వెళ్లలేక సుదూర ప్రాంతాల నుంచి తిరిగి రావాల్సి వస్తోంది. అధికారులు రోడ్డును బాగు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



- ఇది గణనాథుడిని గోవిందుపల్లి కాలనీలో ప్రతిష్ఠించేందుకు తీసుకెళ్తున్నారు. విగ్రహం పెద్దదిగా ఉండటంతో సమీపంలోని విద్యుత్ వైర్లు తాకాయి. అప్రమత్తమైన యువకులు వెంటనే అక్కడి నుంచి తప్పుకున్నారు. అధికారులకు ఫోన్ చేయగా కరెంట్ ఆఫ్ చేసి గణనాథుడిని మంటపానికి తరలించారు.

గిరిజన గ్రామాల్లో వసతులు

- కలెక్టర్ సత్యప్రసాద్

రాయికల్: గిరిజన గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద వసతుల కల్పనకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని జగన్నాథపూర్ గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. సీసీ, బీటీరోడ్లు, డ్రైనేజీ, పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయం, కమ్యూనిటీ హాల్, వాటర్ ట్యాంక్ వంటి సౌకర్యాలను గుర్తించి అవసరమైన వసతుల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రాజ్‌కుమార్, డీపీవో మదన్‌మోహన్, పీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మణ్‌రావు, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ నాగార్జున, పీఆర్ ఏఈ ప్రసాద్ ఉన్నారు.



జగన్నాథపూర్ గ్రామాన్ని సందర్శిస్తున్న జిల్లా కలెక్టర్

రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వంద్వ వైఖరి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ నాయకులు

- ఆరుగ్యారంటీల అమలులో విఫలం
- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల: ఆరుగ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నాయని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ చౌరస్తాలో మంగళవారం ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం కోతల ప్రభుత్వం తప్ప చేతల్లో లేవన్నారు. ఒకవైపు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రభుత్వ వైఫల్యాలను తెలుసుకుంటూ పాదయాత్ర చేయాలన్నారు. తులం బంగారం, స్కూటీలు, నిరుద్యోగ భృతి, పెంచిన పెన్షన్, రైతుభరోసా ఏదని ప్రశ్నించారు. నాయకులు ఆనందరావు, మల్లేశ్, రాజు, వొల్లం మల్లేశం, మహేశ్, రమణ, దేవేందర్‌నాయక్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రభుత్వానికి పట్టింపు లేదు

రెసిడెన్షియల్స్‌లో విద్యార్థులు జ్వరంతో బాధపడుతుంటే ప్రభుత్వానికి కనీస పట్టింపు లేదని వసంత అన్నారు. జిల్లాకేంద్రంలోని భవానీనగర్‌లోని గర్ల్స్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో వంద మందికిపైగా విద్యార్థులు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుసుకుని హాస్టల్‌ను సందర్శించారు. వైద్యాధికారులు వెంటనే హెల్త్‌క్యాంప్ నిర్వహించాలని, కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

జగిత్యాలక్రైం: జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. గ్రేవ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులు, సీడీ ఫైల్స్‌ను, పెండింగ్ ట్రయల్‌లో ఉన్న సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. అనంతరం సీఐ కార్యాలయంలో మొక్కలు నాటారు. డీఎస్పీ రఘుచందర్, డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, రూరల్ సీఐ సుధాకర్, ఎస్సైలు సదాకర్, సుధీర్‌రావు, గీత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

- రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమావేశం
- ప్రతి వినాయక మండపానికి జియో ట్యాగింగ్
- సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మొద్దు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎస్పీ అశోక్‌కుమార్



జగిత్యాలక్రైం: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, పోలీసు శాఖ తరఫున బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. గణేశ్ ఉత్సవాలకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. ఈ మేరకు 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.



గణేశ్ ఉత్సవాలకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

ఎస్పీ: నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకునేలా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు చేపడుతున్నాం. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతి వినాయక మండపం నిర్వాహకులు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా అవగాహన కల్పించాం. మండపాల వద్ద సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలని, రాత్రివేళల్లో నలుగురు వ్యక్తులు అక్కడే ఉండాలని సూచిస్తున్నాం.

జిల్లాలో ఎన్ని విగ్రహాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది..?

ఎస్పీ: గతేడాది 3,041 విగ్రహాలను నెలకొల్పారు. ఈ ఏడాది 3500 విగ్రహాలు ఏర్పాటు చేస్తారని అంచనా వేస్తున్నాం. ఇప్పటివరకు ఆన్‌లైన్ ద్వారా 1667 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రతి వినాయక మండపానికి జియో ట్యాగింగ్ చేస్తున్నాం. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్‌తో పాటు, పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేశాం.

ఎంతమంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు..?

ఎస్పీ: వినాయక నవరాత్రి ఉత్సవాల కోసం సుమారు వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో డయల్ 100 సిబ్బందితోపాటు స్థానిక పోలీసులు ఎప్పుడూ బందోబస్తును పర్యవేక్షిస్తుంటారు. ఇప్పటికే 684 మంది డీజే నిర్వాహకులు, రౌడీషీటర్లు, సమస్యలు సృష్టించే వారిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశాం.

సోషల్ మీడియా పోస్టులపై..?

ఎస్పీ: మండపాల నిర్వాహకులతో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాం. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మవద్దని, ఎవరైనా పోస్టు చేస్తే.. దానిని ఫార్వర్డ్ చేయవద్దని సూచించాం. పోస్టులపై ఎప్పటికప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అవగాహన కల్పించాం.

ప్రజలకు మీ సూచన, సలహాలు..?

ఎస్పీ: జిల్లా ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలి. ప్రతి మండపంలో భద్రతలోపాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. నిమజ్జనం సమయంలో పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలి.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

- డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

సాక్షి స్పందన

కోరుట్ల: పరిసరాల పరిశుభ్రతతోనే దోమలను అరికట్టవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఏసికోనిగుట్ట ప్రాంతానికి చెందిన పసులోటి వెంకటేశం (48) జ్వరంతో మృతిచెందిన విషయం తెల్సిందే. అలాగే పట్టణంలో పలువురు జ్వరాల బారిన పడుతుండటంతో 'సాక్షి' మంగళవారం 'డెంగీబెల్స్' శీర్షికన కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన శ్రీనివాస్ వెంకటేశం ఇంటికి వెళ్లి పరిసరాలు పరిశీలించారు. ఏసికోని గుట్ట ప్రాంతంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. పలు ఇళ్లలోకి వెళ్లి ప్లాస్టిక్ డబ్బాలు, కూలర్లు, రోళ్లలో ఉన్న నీటిని తొలగించారు. 28 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న ఆరుగురికి రక్త పరీక్షలు చేపట్టగా.. నెగెటివ్ వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అయిలాపూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సమీనా, హెల్త్ సూపర్‌వైజర్ జక్కని ధనుంజయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో





కారులో బుజ్జి గణనాథులు, పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు



మంటపాలకు తరలుతున్న గణనాథులు

జగిత్యాలటౌన్: జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి సందడి నెలకొంది. బుధవారం నుంచి ప్రారంభంకానున్న పండుగను పురస్కరించుకుని మంగళవారం గణనాథులను మంటపాలకు తరలించారు. పూజా సామగ్రి, బొజ్జ గణపయ్యల కొనుగోలుతో మార్కెట్ సందడిగా మారింది.

కాపీ రాయుళ్లా.. మజాకా?

- ఎస్‌యూ పరిధిలో జోరుగా చూచిరాతలు
- దొరికాక రాజకీయ నేతలతో ఫోన్లు
- మా వారినే డీబార్ చేస్తారా అంటూ రంగంలోకి లీడర్లు
- డ్యూటీ చేస్తే ఒత్తిళ్లా అంటూ వాపోతున్న సిబ్బంది
- వెనకడుగు వేస్తే ప్రతిఘటిస్తామంటున్న విద్యార్థి సంఘాలు
- జరిగిన వ్యవహారంపై ఆరా తీసిన ఇంటెలిజెన్స్

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

శాతవాహన వర్సిటీ పరిధిలో జరుగుతున్న న్యాయపరీక్షల్లో పట్టుబడుతున్న కాపీరాయుళ్ల వ్యవహారం కలకలం రేపుతోంది. ఇటీవల డిగ్రీ పరీక్షల్లో డీబార్ అయిన ఓ విద్యార్థికి మద్దతుగా ఉత్తారిదికి చెందిన ఓ సీనియర్ మంత్రి ఫోన్ చేసిన విషయం మరవకముందే.. అదే తరహా ఘటనలు పునరావృతమవుతున్నాయి. యథేచ్ఛగా చిట్టీలు పెట్టి రాస్తూ.. వర్సిటీ సిబ్బంది పట్టుకుంటే వెంటనే వారిపై ఒత్తిళ్లు తెస్తూ.. బెదిరిస్తున్నారు. వినకపోతే ఆఖరి అస్త్రంగా రాజకీయ నాయకులను రంగంలోకి దించుతున్నారు. వర్సిటీలో ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు సిబ్బంది ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఓ 'లా' విద్యార్థి ఈనెల 18న కాపీ కొడుతూ వర్సిటీలో దొరికిపోయాడు. వదిలేయాలని కోరాడు. సిబ్బంది వినలేదు. దీంతో పలువురు రాజకీయ నాయకులతో ఫోన్ల మీద ఫోన్లు చేయించడం ప్రారంభించాడు. అప్పటికే అతన్ని డీబార్ చేసిన అధికారులు తామేం చేయలేమని చేతులెత్తేశారు. మరో ఘటనలో నగరానికి చెంది ఓ పార్టీ నాయకుడు నామినేటెడ్ పోస్టులో కొనసాగుతున్నాడు. అతను కూడా లా పరీక్షలో కాపీ కొడుతూ దొరికిపోయాడు. ఈయన సైతం సిబ్బందితో తీవ్ర వాగ్వాదానికి దిగాడు. కాపీ కొడుతూ దొరికిన సంగతి మరిచి, తనను వదిలేయాలంటూ వాదించసాగాడు. యూనివర్సిటీ సిబ్బంది అవేమీ పట్టించుకోకుండా అతన్ని డీబార్ చేసేశారు. ఒక్క పరీక్షలో దొరికి డీబార్ అయినా నిబంధనల ప్రకారం.. మొత్తం సెమిస్టర్ పరీక్షలన్నీ వచ్చే ఏడాది రాసుకోవాలి. ఉదాహరణకు ఒక సెమిస్టర్‌లో ఐదు పేపర్లు ఉన్నాయనుకుంటే.. అందులో ఆఖరు పేపరు రోజు కాపీ కొట్టి దొరికితే.. మొత్తం పరీక్షల్లో డీబార్‌గా ప్రకటిస్తారు. దీంతో మొత్తం పేపర్లు మరో ఏడాది వరకు రాసుకోవాలి.



వారం దాటినా ఆగని ఫోన్లు

వాస్తవానికి ఆ ఒత్తిళ్ల వ్యవహారం ఆ ఒక్కరోజుతో ముగిసిపోలేదు. సదరు అధికారులకు వారం రోజులైనా ఫోన్ల తాకిడి ఆగలేదు. 'మా వాడిని కొంచెం చూడండి.. డీబార్ రద్దు చేయండి' అంటూ ఒత్తిళ్లు తెస్తున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి, సెలవు దినం అన్న తేడా లేకుండా ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు. వాస్తవానికి నిబంధనల ప్రకారం.. ఒకసారి డీబార్ చేసిన తరువాత దాన్ని ఎత్తేయడం అంటూ ఉండదు. ఇదే విషయాన్ని ఫోన్ చేసే వారికి వివరించినా అర్థం కావడం లేదంటూ వర్సిటీ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు వీరి వ్యవహారం తెలిసి కొన్ని విద్యార్థి సంఘాలు కూడా వర్సిటీ సిబ్బందికి ఫోన్లు చేయడం ప్రారంభించాయి. డీబార్ ఎత్తివేస్తే ఊరుకునేది లేదని, వర్సిటీ ఎదుటే ఆందోళనకు దిగుతామంటూ స్పష్టంచేశాయి. దీంతో సిబ్బంది ఇటు కాపీ రాయుళ్లు, అటు విద్యార్థి సంఘాల మధ్య నలిగిపోతున్నారు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా ఇంటెలిజెన్స్ దృష్టికి కూడా వెళ్లింది. దీంతో వారు రంగంలోకి దిగి.. అసలేం జరిగిందో తెలుసుకుని, ప్రభుత్వానికి నివేదిక పంపారు.

ఇది చాలా సాధారణ విషయం

వాస్తవానికి వర్సిటీలో ఈ ఘటన ఈనెల 18న జరిగింది. చాలా సాధారణ విషయం. కొందరు దీన్ని పెద్దదిగా చేసి చూపిస్తున్నారు. సహజంగానే ఈ రోజుల్లో న్యాయపరీక్షలకు ఉన్నత స్థాయి ఉద్యోగులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, డాక్టర్లు, రెవెన్యూ తదితరులు హాజరవుతున్నారు. పరీక్షల్లో కొందరు కాపీ కొడుతూ దొరకడం, వారికి మద్దతుగా రాజకీయ నాయకులు, వీఐపీలు ఫోన్లు చేయడం మాకు షరా మామూలే. – సురేశ్, కంట్రోలర్, ఎస్‌యూ

క్లుప్తంగా

జైలు నుంచి విడిపించండి

- ప్రవాసీ ప్రజావాణిలో బాధిత కుటుంబాల ఫిర్యాదు



ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బాధితుల కుటుంబ సభ్యులు

జగిత్యాలక్రైం: బహ్రెయిన్‌లో రెండేళ్ల జైలు శిక్ష పడిన ఐదుగురిని విడిపించాలని కోరుతూ.. బాధితుల కుటుంబ సభ్యులు మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించారు. తమ కుటుంబ సభ్యులను విడిపించాలని నలుగురి తల్లులు, ఒకరి చెల్లెలు సహాయం కోసం ప్రజావాణిని ఆశ్రయించారు. గడువు తీరిన ఆహార ఉత్పత్తుల తేదీలను ఫోర్జరీ చేసి మార్చడం.. నిల్వ పదార్థాల మార్కెటింగ్ చేసిన కేసులో అక్కడి న్యాయ స్థానం ముగ్గురికి మూడేళ్లు, 19మందికి రెండేళ్ల జైలుశిక్ష విధించింది. వీరిలో జగిత్యాలకు చెందిన గోవిందు రాకేశ్ (రత్నాపూర్) ఉన్నారు. ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్, అంబాసిడర్ వినోద్‌కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డితో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

రైతులకు ఆధునిక టెక్నాలజీ

- మహిళలకు ఆర్థిక స్వాలంబన
- సబ్సిడీపై 'నమో డ్రోన్ దీదీ'

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులకు ఆధునాతన టెక్నాలజీని పరిచయం చేయడంతోపాటు మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా కేంద్ర ప్రభుత్వం నమోడ్రోన్ దీదీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద మహిళాసంఘాలకు ఎరువులు, రసాయనాలు పిచికారీ చేసే డ్రోన్లను సబ్సిడీపై సరఫరా చేయనుంది. రానున్న రోజుల్లో కూలీల సమస్యతో వ్యవసాయ రంగంలో డ్రోన్ల వాడకం పెరగనుండటంతో.. డ్రోన్లను అద్దెకిచ్చి మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని మహిళాసంఘాల నుంచి దరఖాస్తులు స్వీకరించి.. అర్హులైన సంఘాలను ఎంపిక చేయాలని బ్యాంకర్లకు ఆదేశాలు అందాయి.

వ్యవసాయంలో ఆధునికత కోసం

వ్యవసాయ రంగంలో పెరుగుతున్న సాగు ఖర్చులు, కూలీల సమస్యతో రైతులకు పెద్దగా గిట్టుబాటు కావడం లేదు. ఇటీవల పంటలపై పురుగులు, తెగుళ్ల బెడద పెరుగుతుండటంతో ప్రతి రైతు క్రిమిసంహారక, రసాయన మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. అయితే మందులు పిచికారీ చేసేందుకు కూలీలు దొరికే పరిస్థితి లేదు. సన్న, చిన్నకారు రైతుల సంఖ్యే ఎక్కువగా ఉండటం.. ఆర్థిక సమస్యలతో ఆధునిక పరికరాల వాడకం పెద్ద సమస్యగా మారింది. లక్షలు విలువ చేసే పరికరాలను కొనుగోలు చేయలేని రైతులకు అండదండగా ఉండేందుకు మహిళా సంఘాలకు డ్రోన్లు అందించి వాటిద్వారా రైతులకు అద్దెకు ఇవ్వాలని కేంద్రం భావిస్తోంది. దీనివల్ల రైతులు లబ్ధిపొందేలా.. మహిళలు ఆర్థికంగా ఎదిగేలా నమో డ్రోన్ దీదీ పథకానికి రూపకల్పన చేశారు. ఈ పథకం



వ్యవసాయంలో డ్రోన్‌ను ఉపయోగిస్తున్న మహిళ

కింద డ్రోన్‌లను సబ్సిడీపై కొనుగోలు చేసి అద్దెకిస్తే.. నెలకు మహిళా సంఘాల సభ్యులు రూ.లక్ష వరకు సంపాదించే వెసులుబాటు ఉంటుందని బ్యాంకర్లు చెపుతున్నారు.

డ్రోన్ కొనుగోలుకు రూ.8లక్షల సబ్సిడీ

ఈ పథకం కింద దేశవ్యాప్తంగా రూ.1,261 కోట్లతో 14,500 మహిళా సంఘాలకు ఆధునాతన డ్రోన్లను అందించనున్నారు. ఏ మహిళా గ్రూపు ముందుగా దరఖాస్తు చేసుకుంటుందో.. ఆ సంఘం ఎంపికయ్యే అవకాశం ఉంది. ఎంపిక చేసిన మహిళాసంఘాలకు డ్రోన్ పరికరాలను సబ్సిడీపై అందిస్తారు. డ్రోన్ ఖర్చులో గరిష్టంగా రూ.8లక్షల వరకు (80 శాతం) సబ్సిడీ ఇస్తారు. ఉదాహరణకు.. డ్రోన్ కొనుగోలుకు రూ.10 లక్షలైతే.. అందులో రూ.8లక్షల సబ్సిడీ ఇస్తారు. మరో రూ.రెండులక్షల వరకు బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తాయి. తీసుకున్న రుణానికి ఏడాదికి కేవలం 3శాతం వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది. వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గించడం.. పంట దిగుబడి పెంచడంలో డ్రోన్ టెక్నాలజీని రైతులు విరివిగా వాడేలా చైతన్యం చేయాలని వ్యవసాయ శాఖ ద్వారా ప్రచారం చేస్తూనే.. డ్రోన్ల కొనుగోలుకు మహిళాసంఘాలు ముందుకొచ్చేలా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లోకి ఇంకా డ్రోన్లు పెద్దగా రాలేవని, ఇప్పుడే డ్రోన్లు కొనుగోలు చేసి పాగా వేస్తే.. మహిళల ఉపాధికి డోకా ఉండదని అధికారులు భావిస్తున్నారు.

డ్రోన్ టెక్నాలజీలో ప్రత్యేక శిక్షణ

మహిళాసంఘాల గ్రూపులకు డ్రోన్లను సబ్సిడీపై అందించడమే కాకుండా డ్రోన్ టెక్నాలజీ.. ఉపయోగంపై ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ దాదాపు 15రోజులు ఉంటుంది. శిక్షణలో వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు పాలుపంచుకుంటారు. డ్రోన్లు ఆధునాతన జీపీఎస్, సెన్సార్ టెక్నాలజీతో రూపొందించబడి ఉంటాయి. ఏ మందును ఎంత ఎత్తులో పిచికారీ చేయాలనే దానిపై కూడా పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి శిక్షణ ఇస్తారు. పురుగుమందులు పిచికారీ చేయడమే కాకుండా.. పొలంలో కలుపుమొక్కలు ఎక్కడున్నాయి..? నీరు ఎక్కడ లేదు..? వంటి వాటిపై కూడా డ్రోన్ శిక్షణలో మహిళలకు వివరిస్తారు. అలాగే మరమ్మతు, ఫిట్టింగ్ వంటి వాటి కోసం మరో సహాయకుడిని నియమించుకుంటే వారికీ శిక్షణ ఇస్తారు. ఈ పథకంలో డ్రోన్ డిమాండ్ అధికంగా ఉండే మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకోవచ్చు.

బ్యాంకుల్లో దరఖాస్తు చేసుకోవాలి



జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా 15వేల డ్రోన్లు ఇవ్వనున్నందున ఎవ్వరు ముందుగా దరఖాస్తు చేసే వారికి ఈ పథకం అందనుంది. అర్హత ఉండి, ఆసక్తి గల మహిళా సంఘాలు సమీపంలోని బ్యాంకులను సంప్రదించవచ్చు.

– రాంకుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్, జగిత్యాల

ఇసుక రీచ్‌ను రద్దు చేయండి



రీచ్‌లోకి వాహనాలు వెళ్లకుండా తవ్విన కందకం



ఆత్మకూర్‌లో ఇసుక రీచ్ రద్దు చేయాలని నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

- మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లో గ్రామస్థుల నిరసన
- రీచ్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయింపు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ పెద్దవాగులో ఇసుక రీచ్‌ను గుర్తిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. రీచ్‌గా గుర్తిస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక రీచ్ పాయింట్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించి దాదాపు నాలుగు గంటలపాటు ఆందోళన చేశారు. వాగులో ఇసుక తవ్వితే భూగర్భ జలాలు పడిపోతాయని, నీటిలభ్యత తగ్గి పర్యావరణం దెబ్బతింటుందని పేర్కొన్నారు. రీచ్ వద్దని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులను కలిశామని, వారి నుంచి స్పందనలేదని తెలిపారు. ఎన్నడూ లేనివిధంగా కొత్తగా ఈ ప్రాంతంలో రీచ్ ఏర్పాటు చేయడమేంటని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ ఉమేశ్ అక్కడికి చేరుకుని ప్రభుత్వ నిర్ణయం, ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చామని స్పష్టం చేశారు. అనుమతి ఉన్న వాహనాలను అడ్డుకోవద్దని, అధికారుల విధులకు ఆటంకం కలిగించొద్దన్నారు. ఇబ్బందులు సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

రీచ్‌లోకి వాహనాలు వెళ్లకుండా కందకం

రీచ్‌లోకి వాహనాలు వెళ్లకుండా గ్రామస్తులు పొక్లెయిన్‌తో కందకం తవ్వించారు. కథలాపూర్ మండలం కలిగోట సూరమ్మ ప్రాజెక్ట్ పనులకు ఇసుక తరలించేందుకు అధికారులు అనుమతి ఇచ్చిన విషయం తెల్సిందే. రీచ్ పాయింట్‌లోకి వాహనాలు వెళ్లేలా కాంట్రాక్టర్ ఇటీవల దారి పోయించాడు. ముందుగా ఆందోళన చేసిన గ్రామస్తులు అనంతరం వాహనాలు వెళ్లకుండా కందకం తవ్వించారు.

శిక్షణ కేంద్రాలతో యువతకు ఉపాధి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే

రాయికల్: నిరుద్యోగ యువత శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని చిన్న జీయర్‌స్వామి ట్రస్ట్ భవనంలో జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిమ ఫౌండేషన్ సౌజన్యంతో ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, టైలరింగ్, హోం ఎయిడ్ హెల్త్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించారు. నిరుద్యోగ యువత కోసం మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు జీఎంఆర్ ట్రస్ట్ ప్రారంభించారని, ఇప్పుడు ఇస్తున్న ఉచిత శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, చిన్న జీయర్‌స్వామి ట్రస్ట్ ఇన్‌చార్జి ముత్యం రాజిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ మహేశ్, జీఎంఆర్ సిబ్బంది నాగేందర్, ప్రమోద్, చిరంజీవి, కృష్ణవేణి, వనిత, ప్రతిమ ఫౌండేషన్ మేనేజర్ గీతరెడ్డి, ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి పాల్గొన్నారు.

అధికార పార్టీగా మద్దతుగా ఉంటేనే అభివృద్ధి

సారంగాపూర్: అధికార పార్టీకి మద్దతుగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. బీర్‌పూర్, సారంగాపూర్‌లో తన మద్దతుదారులతో సమావేశమయ్యారు. రోళ్లవాగు ప్రాజెక్టు పూర్తికి కృషి చేస్తున్నానని తెలిపారు. తుంగూర్‌లో కేజీబీవీ ఏర్పాటు చేశామన్నారు. 14 పల్లెదవాఖానాలు మంజూరు చేశామన్నారు. బీర్‌పూర్ మండలంలో ఇందిరానగర్, గొండుగూడెంలను పంచాయతీలు చేశామన్నారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, విండో చైర్మన్లు ఏలేటి నర్సింహారెడ్డి, గుర్నాథం మల్లారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న కార్లు

మల్యాల: మండలంలోని దిగువ కొండగట్టు వద్ద జగిత్యాల–కరీంనగర్ రహదారిపై మంగళవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రెండుకార్లలో ఉన్న నలుగురు గాయపడ్డారు. కొండగట్టుకు చెందిన రంగు నర్సింహులు, విజయ హైదరాబాద్ నుంచి కొండగట్టుకు వస్తున్నారు. జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భర్త అడువాల లక్ష్మణ్ కరీంనగర్ వైపు వెళ్తున్నాడు. దిగువ కొండగట్టు వద్ద రెండు కార్లు ఎదురెదురుగా వేగంగా ఢీకొన్నాయి.



కార్ల ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. కార్ల బెలూన్లు తెరుచుకోవడంతో నర్సింహులు, విజయ, అడువాల లక్ష్మణ్, మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. ట్రాఫిక్ అంతరాయం కలుగడంతో ఎస్సై నరేశ్‌కుమార్, కానిస్టేబుల్ మధుసూదన్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. బాధితులను 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. నర్సింహులు అతివేగంగా, అజాగ్రత్తగా కారు నడిపి అడువాల లక్ష్మణ్ కారును ఢీకొన్నారని, లక్ష్మణ్ బావమరిది మిట్టపల్లి సాయిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు.

కేడీసీసీబీలో భారీగా బదిలీలు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా స్థానచలనం

కరీంనగర్ అర్బన్: కేడీసీసీబీలో భారీగా బదిలీలు జరిగాయి. సెక్రటరీలు, స్టాఫ్ అసిస్టెంట్లకు స్థానచలనం కల్పిస్తూ డీఎల్ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. 131 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు గానూ బదిలీలు నిర్వహించగా తక్షణమే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గొండ రామయ్య(గట్టుదుద్దెనపల్లి)ను పోరండ్ల ప్యాక్స్ సెక్రటరీగా బదిలీ చేయగా కలం నర్సయ్య(చిగురుమామిడి)ను అక్కడే నియమించగా కడారి మల్లేశం(రామడుగు)ను కొక్కెరకుంట, పాకాల లక్ష్మారెడ్డి(మానకొండూరు)ను ఊటూరు, మహ్మద్ సర్ఫరాజ్ హుస్సేన్(తుమ్మనపల్లి)ను హుజూరాబాద్, శనిగరపు సదయ్య(మెట్‌పల్లి)ను మానకొండూరు, కల్లెం తిరుపతిరెడ్డి(చొప్పదండి)ని అక్కడే నియమించారు. పోతర్ల శ్రీనివాస్(గద్దపాక)ను ధర్మారం, మిట్టపల్లి రవీందర్(ఊటూరు)ను ఎల్కతుర్తి, చీకటి కుమారస్వామి(ఆర్నకొండ)ని కరీంనగర్, గొల్లె రామయ్య(కొక్కెరకుంట)ను ఆర్నకొండ, మేకల రమేష్(కరీంనగర్)ను దుర్శేడ్, గాలిపల్లి రమేష్(గంగాధర)ను కురిక్యాల, కసిరెడ్డి మల్లిఖార్జున్‌రెడ్డి(దేవంపల్లి)ని గట్టుదుద్దెనపల్లి, చెల్మల మల్లారెడ్డి (వెన్నంపల్లి)ని దేవంపల్లి, గాజుల ప్రభాకర్(కురిక్యాల)ను గంగాధర, చింతలపల్లి ఆదిత్య (ఇల్లందకుంట)ను వీణవంక, గుర్రం ఆంజనేయులు(నుస్తులాపూర్)ను పోరండ్ల, గోస్కుల వివేకానంద(హుజూరాబాద్)ను వెన్నంపల్లి, చందుపట్ల ప్రకాష్‌రెడ్డి(వీణవంక)ని సైదాపూర్, చెనవేని శ్రీధర్(సైదాపూర్)ను కమలాపూర్, జి.శ్రీనివాస్(ధర్మారం)ను తనుగుల, జి.శ్రీనివాస్(తనుగుల)ను ఇల్లందకుంటకు బదిలీ చేశారు.

అసమర్థ పాలనతో రైతులకు ఇబ్బందులు



ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గొల్లపల్లి: రాష్ట్రంలో అసమర్థ కాంగ్రెస్ పాలనతో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారని బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు.. మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాలతో పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పాలకులు స్పందించి రైతుల అందరికీ ఇబ్బంది లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గోస్కుల జలంధర్, కో–ఆర్డినేటర్ బోయపోతు గంగాధర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా అందించకపోవడం దారుణం

ధర్మపురి: రైతులకు సరిపడా యూరియా అందించకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారు. పట్టణంలోని జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. యూరియా కోసం రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. నాయకులు ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, అయ్యోరి రాజేష్, సొల్ల భీమన్న, సంగి శేఖర్, మొగిలి శేఖర్, మహిపాల్‌రెడ్డి, స్తంభంకాడి మహేశ్, శ్యాం, ప్రేమచందర్‌రావు, మహేశ్, ఆరెపల్లి రమేశ్, అయ్యోరి వేణుగోపాల్, నర్సయ్య, కాశెట్టి విజయ్ పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తజన సందడి



మల్యాల: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి వారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు కోనేరులో స్నానమాచరించారు. క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. సామూహిక అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. లడ్డూప్రసాదాలు విక్రయాలు, దర్శనం టికెట్ల విక్రయాల ద్వారా ఆలయానికి రూ.5,51,765 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.